సమాచారం

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కీసర: కీసర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33/11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని కీసర విద్యుత్ ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా సబ్‌స్టేషన్ పరిధిలోని కీసర, కీసరదాయర, అంకిరెడ్డిపల్లి, కీసరగుట్ట, రామలింగేశ్వర్‌నగర్ కాలనీ, కుందన్‌పల్లి, సాయినగర్‌కాలనీ, సాయికాలనీల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ఇందుకు విద్యుత్ వినియోగదారులు సహకరించాలన్నారు.

బండమాదారం పరిధిలో...

మేడ్చల్‌రూరల్: మరమ్మతుల కారణంగా మండలంలోని బండమాదారం 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో రూరల్ ఏఈ పవన్‌చంద్ తెలిపారు. ఇందులో భాగంగా బండమాదారం, శ్రీరంగవరం, గిర్మాపూర్, రాయిలాపూర్ గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు జాతీయ స్థాయి మహాసభ

కీసర: రాంపల్లిదాయర గ్రామ రెవెన్యూ పరిధిలో గల బాలవికాస సంస్థలో సోమవారం ఉదయం 'జన నిర్మాణం–సమాజ వికాసం' అనే అంశంపై జాతీయ స్థాయి మహాసభను నిర్వహించడం జరుగుతుందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సింగారెడ్డి శౌరిరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి సుమారు 7వేల మంది బాల వికాస అభివృద్ధి కమిటీకి చెందిన మహిళ, రైతు, శుద్ధిత నీటి ప్లాంట్ల, వితంతు, విద్యా వికాస నాయకులు మహాసభలో పాల్గొనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగాలు మంత్రులు తన్నీరు హరీష్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మల్లారెడ్డి, ఏపీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ రాజేష్‌పవర్ తదితరులు పాల్గొననున్నట్లు తెలిపారు.

27న కౌన్సిల్ సమావేశ మందిరం ప్రారంభం



మంత్రిని కలిసిన పోచారం నాయకులు

పోచారం: మున్సిపల్ భవనంపై నూతనంగా నిర్మించిన కౌన్సిల్ సమావేశ మందిరాన్ని ఈ నెల 27న కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా మంత్రిని చైర్మన్ కొండల్ రెడ్డితో పాటు కొంత మంది కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు ఆదివారం కలిసి కార్యక్రమం గురించి వివరించారు. పాలకవర్గం ఏర్పడి మూడేళ్లు కావస్తున్నా శుభ సమయాన ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

రేపు బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడి

మేడ్చల్‌రూరల్: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీన తలపెట్టిన బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మండల యువసేన అధ్యక్షుడు భానుచందర్ కోరారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు సాధనకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు ఈ కార్యక్రమం తలపెట్టినట్లు తెలిపారు.

క్లుప్తంగా

అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేయాలి



అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్

కీసర: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దమ్మాయిగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ అన్నారు. అంబేడ్కర్‌కు ప్రతివారం జ్ఞాన మాల సమర్పణలో భాగంగా మున్సిపల్ పరిధిలోని అహ్మద్‌గూడ ఆర్‌జీకే కాలనీలో గల అంబేడ్కర్ విగ్రహానికి ఆమె పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నాగయపల్లి సుజాత శ్రీనివాస్, నానునాయక్, కొత్త హేమలతశ్రీనివాస్, మంగల్‌పురి వెంకటేష్, కొత్త సురేఖభాస్కర్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు వసుపతి శ్రీకాంత్ గౌడ్, శ్రీనివాస్, నాగయ్య పాల్గొన్నారు.

కీసరలో 51వ వారం...

అంబేడ్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పణ కార్యక్రమంలో భాగంగా ఆదివారం కీసరలో 51 వారం అంబేడ్కర్ విగ్రహానికి బీజేపీ మండల అధ్యక్షుడు దేశం మల్లేష్, ప్రధాన కార్యదర్శి గేటి బాపిరెడ్డి, ఎంపీటీసీ సింగిరెడ్డి వెంకట్‌రెడ్డిల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం మండలాధ్యక్షుడు మొర్గు రవీందర్ తదితరులు ఉన్నారు.

బోడుప్పల్, జవహర్‌నగర్లలో.. యథేచ్ఛగా భూ దందా!

- సర్కారు ఆదాయానికి భారీగా గండి
- రాత్రికి రాత్రే వెలుస్తున్న అక్రమ కట్టడాలు
- పురపాలికలు, జీపీల్లో దండిగా అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లు
- ప్రభుత్వ, అసైన్డ్ భూముల్లోనూ కట్టడాలు
- పట్టించుకోని రెవెన్యూ శాఖ
- కూల్చివేసి క్రిమినల్ కేసులు పెడతాం: కలెక్టర్ హరీష్



బోడుప్పల్ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో ఇలా..



జవహర్‌నగర్‌లో అనుమతులు లేకుండా ఫామ్ ల్యాండ్ పేరుతో వెలసిన విల్లాలు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో భూదందా యథేచ్ఛగా కొనసాగుతోంది. 'చేను కంచె మేసే' అన్న చందంగా అక్రమ నిర్మాణాలు, లేఅవుట్లను నిరోధించి ప్రభుత్వ భూములను కాపాడాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు వాటిని పట్టించుకోకపోవడంతో పాటు వారే అక్రమాలను ప్రోత్సహిస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. పేదలు గుడిసె వేసుకుంటే కూల్చే వరకు వెంటపడే అధికారులు ప్రభుత్వ స్థలాల పరిరక్షణ, అక్రమ కట్టడాల కూల్చివేతలో మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నారు. అర్థ, అంగ బలం ఉన్న బడాబాబులు, రాజకీయ నేతల అనుచరులు గజాలు కాదు.. ఏకంగా ఎకరాల కొద్దీ ఆక్రమించేస్తూ ప్రభుత్వ ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొడుతున్నారు.

ఈ ప్రాంతాల్లో అధికంగా...

◆ బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలోని సర్వే నంబర్ 63/29లో 30 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉండగా.. 1974 నుంచి ఆక్రమణకు గురవుతోంది. బోడుప్పల్ జీపీగా ఉండటంతో ఓ కబ్జాదారుడు 220 గజాల నుంచి 440 గజాల చొప్పున నకిలీ లేఅవుట్ సృష్టించి ఒక్కో ప్లాట్‌కు రూ.50 వేల నుంచి రూ.లక్షకు విక్రయించాడు. ప్రస్తుతం ఇదే స్థలాన్ని కబ్జాదారులు, పలువురు రాజకీయ నేతలు ప్రజాప్రతినిధుల అండతో 60 గజాల నుంచి 80 గజాలు ఉండేలా కొత్త లేఅవుట్ సృష్టించి ఒక్కో ప్లాట్‌ను గజానికి రూ.10 వేల చొప్పున విక్రయిస్తున్నారు. దీంతో బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని సర్వే నంబరు 63/29లో రాత్రికి రాత్రే అక్రమంగా ఇళ్లు వెలుస్తున్నాయి. ఇందుకు గాను స్థానిక ఉద్యోగి మొదలుకుని ఓ స్థాయి అధికారి వరకు ఒక్కో ప్లాట్‌కు రూ.50 వేలు ముట్టజెప్పుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

◆ నాగారంలోని 297 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతున్నా రెవెన్యూ శాఖలో చలనం లేదు. నాగారం మున్సిపాలిటీ పరిధిలో ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న ఐదెకరాల ప్రభుత్వ, అసైన్డ్ భూములు కబ్జాకు గురయ్యాయి.

◆ శామీర్‌పేట్‌లో రియల్టర్లు తమకున్న 45 ఎకరాల పక్కన 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కాజేసి వెంచరు చేసినా.. రెవెన్యూ అధికారులకు స్పందన లేదని తెలుస్తోంది.

◆ జవహర్‌నగర్‌లోని సర్వే నంబర్లు 137, 377, 583, 586, 598, 647ల లోని దాదాపు 30 ఎకరాల ప్రభుత్వ భూముల్లో నకిలీ లేఅవుట్లు సృష్టించి ఒక్కో ప్లాట్‌ను రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు కబ్జాదారులు విక్రయిస్తున్నారు. పలువురు కార్పొరేటర్లు, నేతలు కీలకంగా వ్యవహరిస్తుండగా.. ఓ ప్రజాప్రతినిధి అండదండలు ఉన్నట్లు తెలుస్తోంది.

అక్రమ నిర్మాణాలు కూల్చివేసి ప్రభుత్వ భూములు కాపాడుతాం



జిల్లాలో ప్రభుత్వ, అసైన్డ్ భూములను పరిరక్షిస్తాం. పురపాలకలు, జీపీల్లో వెలసిన అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తాం. బఫర్ జోన్, చెరువు శిఖాలు, నాలాలు, రోడ్లు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను సైతం కూల్చివేస్తాం. జిల్లాలో టాస్క్ ఫోర్స్‌టీమ్‌లు అక్రమ నిర్మాణాల కూల్చివేతపై నిరంతరం నిఘా ఉంచింది. అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలు చేపట్టే వారిపై అవసరమైతే క్రిమినల్ కేసులు పెడతాం. టీఎస్ బీ–పాస్ ద్వారా ఇళ్లు, బహుళ అంతస్తుల నిర్మాణాలకు ఖచ్చితంగా అనుమతులు తీసుకోవాలి.

– హరీష్, కలెక్టర్, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

అక్రమ నిర్మాణాలు.. లేఅవుట్లు..

◆ లింగాపూర్ తండా రెవెన్యూ పరిధిలోని రెండున్నర ఎకరాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఫామ్‌ల్యాండ్ పేరుతో వెంచర్ చేసి ఇందులో ఒక్కో విల్లాను రూ.60లక్షల నుంచి రూ.75 లక్షలకు విక్రయిస్తున్నారు.

◆ ఘట్కేసర్ మండలం కొర్రెములలోని సర్వే నంబర్ 748,749 పరిధిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. అలాగే 50 నుంచి 75 వరకు అక్రమ భవన నిర్మాణాలవుతున్నా.. అమ్యామ్యాలకు అలవాటు పడిన పలువురు అధికారులు, సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

ప్రతి నిత్యం ఏదో ఓ చోట...

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రతి రోజు ఏదో ఒక డివిజన్‌లో అక్రమ కట్టడాలు జరుగుతూనే ఉన్నా.. పట్టించుకునే వారే కరవయ్యారు. జవహర్‌నగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా 40 నుంచి 50 వరకు బహుళ అంతస్తు భవనాలు వెలువగా... ఇందులో ముగ్గురు ముఖ్య ప్రజాప్రతినిధులవే ఉన్నట్లు తెలుస్తోంది. పదుల సంఖ్యలో అక్రమ భవనాలు వెలిసినా.. నిరుపేదలవి కూల్చివేస్తున్న అధికారులు రాజకీయ నేతల ఇళ్ల జోలికి వెళ్లడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

అధికారికంగా గుర్తించిన కట్టడాలివే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో పురపాలక సంఘాలైన నాగారంలో 12 అక్రమ కట్టడాలు, లేఅవుట్లు ఉండగా, బోడుప్పల్‌లో 107, పీర్జాదిగూడలో 67, దమ్మాయిగూడలో 7, మేడ్చల్‌లో 10, నిజాంపేట్‌లో 20, కొంపల్లిలో 11, దుండిగల్‌లో 12, తూముకుంటలో 15, పోచారంలో 12, ఘట్‌కేసర్‌లో 8 ఉన్నట్లు గుర్తించారు. రూరల్ జిల్లా పరిధిలోని కీసర మండలంలో 265, శామీర్‌పేట్‌లో 185, మేడ్చల్‌లో 72, ఘట్‌కేసర్‌లో 67, ఏంసీ పల్లి మండలంలో 89 అక్రమ కట్టడాలు, లేఅవుట్లు ఉన్నట్లు జిల్లా పంచాయతీ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

పంచాయతీ పనితీరుకు ప్రోత్సాహం

- గ్రామీణ స్థితిగతులను మెరుగుపర్చేందుకే..
- మండలాల నుంచి జిల్లాకు చేరిన జాబితా
- ఈ నెలాఖరు కల్లా పని తీరుపై పరిశీలన

సాక్షి,మేడ్చల్ జిల్లా: గ్రామీణ స్థితిగతులను మెరుగుపరిచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయతీలకు ఎన్నో వనరులను కల్పిస్తున్నాయి. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ప్రజల జీవన ప్రమాణాలు, పచ్చదనం, పరిశుభ్రత, ప్రజారోగ్యం, సామాజిక భద్రత భరోసా, పేదరిక నిర్మూలన వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని భారీ నజరానా ప్రకటించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. జాతీయ గ్రామీణ అవార్డుల్లో భాగంగా 29 శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులకు అవార్డుల విధి విధానాలు, గ్రామ స్థాయిలో సమాచార సేకరణపై ఇప్పటికే ఒక రోజు శిక్షణ నిర్వహించారు. జిల్లాలో 5 మండలాలు, 61 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఈ సమాచారాన్ని కలెక్టరేట్‌కు అందించారు. జిల్లా స్థాయిలో తొమ్మిది అంశాల్లో అర్హతలున్న అన్ని గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపించారు. అంశాల వారీగా జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో నిర్దేశించిన నమూనాలో సమాచారాన్ని పొందుపర్చారు. జిల్లా స్థాయిలో మరోసారి గ్రామ పంచాయతీల్లోని 9 అంశాలను పరిశీలించి జిల్లా స్థాయిలో ఎంపికైన పంచాయతీలను రాష్ట్రం నుంచి జాతీయ స్థాయికి పంపిస్తారు. ఈ ప్రక్రియ ఫిబ్రవరిలో ముగిసి, ఏప్రిల్‌లో అవార్డులు ప్రకటించే అవకాశం ఉంది.

అవార్డులు ఇలా..

తొమ్మిది అంశాలను పరిగణలోనికి తీసుకుని గ్రామ, మండల, జిల్లా స్థాయిలో అవార్డులు ప్రకటించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. విభాగాల వారీగా పరిశీలించి అవార్డుల ప్రకటించి నజరానా అందించనున్నారు. రూ.20 లక్షల నుంచి రూ.5 కోట్ల వరకు అందించేందుకు ప్రభుత్వం కసరత్తులు చేస్తోంది. మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచే పంచాయతీకి రూ.1.50 కోట్లు, ద్వితీయకు రూ.1.25 కోట్లు, తృతీయకు రూ.కోటి ప్రోత్సాహకం ప్రకటించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానానికి రూ.5 కోట్లు, ద్వితీయ రూ.3 కోట్లు, తృతీయ స్థానానికి రూ.2 కోట్లు ఇవ్వనున్నారు. అధికారులు ఆ దిశగా ప్రణాళిక రూపొందించి కార్యాచరణ పూర్తి చేశారు.

ఉత్తమ జీపీల ఎంపికకు 9 అంశాలివే..

గ్రామ పంచాయతీల్లో పేదరిక నిర్మూలన, మెరుగైన జీవన విధానం, ఆరోగ్య స్థితిగతులు మెరుగ్గా ఉండటం, పిల్లలకు స్నేహ పూర్వక వాతావరణం పంచాయతీల్లో కల్పించడం వంటి అంశాలను పరిశీలిస్తారు. అలాగే గ్రామాలు సమృద్ధిగా జలసిరి కలిగి ఉండటం, స్వచ్ఛత, హరితహారంలో ప్రథమ స్థానం పొంది ఉండటం, మౌలిక వసతుల్లో స్వయం సమృద్ధి కలిగి ఉండటం, సామాజిక భద్రత, పాలనలో పారదర్శకత, మహిళా స్నేహశీలత కలిగి ఉండటం వంటి అంశాలు పంచాయతీల ఉత్తమ అవార్డులకు ఎంపికకు పరిశీలించనున్నారు.

సేవ చేయడంలోనే ఆనందం: ఎమ్మెల్సీ బండ ప్రకాశ్



అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ బండప్రకాశ్ ముదిరాజ్ తదితరులు

జవహర్‌నగర్: సేవ చేడయంలో ఎంతో ఆనందం ఉంటుందని, అలాంటి వారికి ప్రభుత్వం అన్ని విధాల సహాయ, సహకారాలు ఉంటాయని ఎమ్మెల్సీ బండ ప్రకాశ్‌ముదిరాజ్ అన్నారు. ఆదివారం అంబేడ్కర్ నగర్‌లోని రోజ్‌గార్డెన్‌లో తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే సేవారత్న అవార్డు గ్రహీత అరకుల అనిల్‌కుమార్ ముదిరాజ్ సన్మానసభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. సమాజంలో సేవా దృక్పథం ముదిరాజ్ కుటుంబాల్లో చాలా ఉందని, నిరుపేదల కోసం అనిల్‌కుమార్ అనేక సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమలలో జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య, దమ్మాయిగూడ చైర్‌పర్సన్ ప్రణీత, మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, కార్పొరేటర్లు, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కృపాసాగర్, టీఆర్ఎస్ జవహర్‌నగర్ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అశోక్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో మేడ్చల్ విద్యార్థుల ప్రతిభ



పతకాలతో విద్యార్థినులు

మేడ్చల్‌రూరల్: జాతీయ తైక్వాండో పోటీల్లో మేడ్చల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు తమిళనాడులోని కేఎస్ఆర్ యూనివర్సిటీలో జరిగిన జాతీయ తైక్వాండో ఛాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణకు చెందిన నలుగురు విద్యార్థులు పాల్గొనగా వారిలో మేడ్చల్‌కు చెందిన విద్యార్థినులు రీచా యాదవ్, దేవశ్రీలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో రీచా యాదవ్ రజతం, దేవశ్రీ కాంస్య పతకాలను సాధించి సత్తా చాటడంతో పాటు అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. పోటీల్లో కోచ్ లక్ష్మణ్, బిందు పాల్గొని పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

మనుషుల మధ్య తారతమ్యాలు లేకుండా జీవించాలి



అంబేడ్కర్ పూలమాలలో మాట్లాడుతున్న కౌన్సిలర్ మహేశ్‌కుర్మ

ఘట్‌కేసర్: మనుషుల మధ్య తారతమ్యాలు లేకుండా జీవించాలని ఆనాడే అంబేడ్కర్ బోధించాడని పోచారం మున్సిపాలిటీ కౌన్సిలర్ మహేశ్‌కుర్మ అన్నారు. అంబేడ్కర్‌కు ప్రతివారం జ్ఞాన మాల సమర్పణలో భాగంగా పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అరుణ్‌కుమార్, దాసు, అంజయ్యగౌడ్, రాములు, రాందాస్, శ్రీనివాస్, నర్సింగ్‌రావు, చందు, ఆంజనేయులు, గణేశ్, నిఖిల్, విష్ణువర్ధన్, సచిన్, నితిన్, హరీశ్, కార్తీక్ పాల్గొన్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య



నాగమణి(ఫైల్)

జవహర్‌నగర్: ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అంబేడ్కర్‌నగర్ ప్రగతినగర్‌లో నివసించే సతీష్, నాగమణి(32)లకు ఒక కుమారుడు, కుమార్తెతో కలిసి నివసిస్తున్నారు. వీరికి 2013లో ప్రేమ వివాహం జరిగింది. ఆదివారం మధ్యాహ్నం సమయంలో సతీష్ వారి పిల్లలతో కలిసి బయటకు వెళ్లి తిరిగి వచ్చే సరికి నాగమణి ఇంట్లో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రేవ్‌యార్డ్‌కు స్థలం కేటాయించండి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ముస్లింలు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ పట్టణంలో గ్రేవ్‌యార్డ్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని పట్టణానికి చెందిన ముస్లింలు కోరారు. ఈ మేరకు ఆదివారం వారు మంత్రి మల్లారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా షాదీఖానా (ఫంక్షన్ హాల్) ఏర్పాటుకు కూడా కృషి చేయాలని కోరగా ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మహబూబ్ అలీ, ముస్లిం నాయకులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.లక్షతో నిర్మిస్తున్న వెంకటాపూర్ శ్రీకట్టమైసమ్మ ఆలయం సీసీ రోడ్డు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రామారావు ముదిరాజ్, ఉప సర్పంచ్ సత్యనారాయణగౌడ్, వార్డు సభ్యులు హరీశ్, కృష్ణ, నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, బాలుయాదవ్, రాజశేఖర్‌రెడ్డి, సత్తయ్య, నందు, జంగయ్య, లింగం ముదిరాజ్, ప్రేమ్‌కుమార్, నవీన్, శ్రీకాంత్, కార్తీక్, నిఖిల్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటితరం యువత ఉపాధి వైపు అడుగులు వేయాలి

- హైదరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (అడ్మిన్) జె.పరిమిళ హన నూతన్



గుడ్‌విల్ స్పోర్ట్స్ వేర్‌ను ప్రారంభిస్తున్న జె.పరిమిళ హన నూతన్

జవహర్‌నగర్: మారుతున్న కాలానికి అనుగుణంగా ఫ్యాషన్ ప్రపంచం విస్తరిస్తోందని, నేటితరం యువత ఉపాధి వైపు అడుగులు వేయాలని హైదరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (అడ్మిన్) జె.పరిమిళ హన నూతన్ అన్నారు. ఆదివారం జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని సీఆర్‌పీఎఫ్ అరుంధతినగర్‌లో కె.ఇందిర రాజశేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గుడ్‌విల్ స్పోర్ట్స్ వేర్‌ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో నిల్సన్, శివకృష్ణ చైతన్య, పాస్టర్ ప్రభుదాస్, నవీన్ డానియేల్, కురపర్తి వంశీకృష్ణ, రాజేందర్, ప్రభాకర్‌రావు, రాజశేఖర్ తదితరులున్నారు.



గట్టుమైసమ్మ అమ్మవారు



భక్తజన సంద్రమైన అమ్మవారి ఆలయ ప్రాంగణం

గట్టుమైసమ్మ ఆలయ ప్రాంగణం భక్త జన సంద్రం



అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటున్న మంత్రి చామకూర మల్లారెడ్డి తదితరులు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తదితరులు

- వైభవంగా శ్రీగట్టుమైసమ్మ ఆలయ జాతర
- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాల సమర్పణ
- భక్తులతో పాటు మొక్కులు చెల్లించుకున్న ప్రముఖులు

ఘట్‌కేసర్: కోరిన కోర్కెలు తీరుస్తూ కొంగు బంగారమై వెలుగొందుతున్న మహిమాన్విత పుణ్య క్షేత్రం శ్రీగట్టుమైసమ్మ ఆలయం భక్త జన సంద్రంగా మారింది. పట్టణంలో ఆదివారం జరిగిన జాతరకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయం ఆవరణ భక్తులతో కిటకిటలాడింది. పట్టణ ప్రజలే కాకుండా నల్గొండ, మెదక్, హైదరాబాద్ జిల్లాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. భక్తులు బోనాలతో తరలిరావడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. డప్పుల మోతలు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో ఊరేగింపుగా వచ్చి బోనాలు, నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారు ఆవహించిన వ్యక్తి భవిష్యవాణి వినిపించారు. భక్తులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా మున్సిపాల్ పాలకవర్గం అన్ని ఏర్పాట్లు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏసీపీ నరేశ్‌రెడ్డి, సీఐ అశోక్‌రెడ్డి, డీఐ జంగయ్య ఆధ్వర్యంలో 120 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

వేడుకలో ప్రముఖులు...

శ్రీగట్టుమైసమ్మ జాతరలో మంత్రి మల్లారెడ్డి, హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, చైర్ పర్సన్ పావనీయాదవ్, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ చిత్తారియాదవ్, డైరెక్టర్ జంగారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీటీసీ శోభారాణి, ముత్యాలుయాదవ్, ఈఓ భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.



భవిష్యవాణి వినిపిస్తున్న అమ్మవారు ఆవహించిన భక్తుడు



అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో కీసర ఉన్నత పాఠశాలకు చెందిన 1989-90 విద్యార్థులు



రాంపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన 1989-90 బ్యాచ్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

కీసర: మండల కేంద్రమైన కీసరలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 1989–90 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం కీసరలోని లలితా కన్వెన్షన్ హాల్‌లో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారంతా తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. విద్యార్థి దశలతో తమకు విద్యా బుద్ధులు నేర్పిన తమ గురువులను ఘనంగా సత్కరించుకున్నారు. నాయకపు వెంకటేష్, బండమీది రమేష్‌గౌడ్, మిట్టపల్లి రాజుగౌడ్, వెంకట్రామిరెడ్డి, జంగయ్య, సుధాకర్‌రెడ్డి, కిషన్, చీర సురేష్, ఆనబోయిన జంగయ్య పాల్గొన్నారు.

రాంపల్లి పాఠశాలలో..

నాగారం మున్సిపాలిటీ రాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో 1989–90 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం రాంపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమ చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకోవడంతో పాటు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించుకున్నారు. కార్యక్రమంలో కీరంగూడ గ్రామ సర్పంచ్ గోపాల్‌రెడ్డి, ఏనుగు రాజిరెడ్డి, బల్‌రామ్, ఎల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.